“ నౌ ఇట్స్ క్లియర్ యశస్వీ.... అనుమానం లేదు. కాని వాడ్ని అరెస్టు చేయరు. కారణం మీ డిపార్టుమెంటులో చాలా మంది వాడి
ద్వారానే తమ పనులు చేయించుకునే దౌర్భాగ్య స్థితిలో వున్నారు కాబట్టి.... నా అంచనా తప్పు కాకపోతే హరి సాధ్యమైనంత త్వరలో నానీ ప్రాణాలు తీస్తాడు. స్పష్టంగా చెప్పాలీ అంటే... ఇప్పటికి అదొక్కటే ముఖ్యమైన కర్తవ్యంగా తీసుకుంటాడు.
అవును యశస్వీ!
రేపు పేపర్లో మరోమారు నానీ ఫోటోని, మా జర్నలిస్టుల యూనియన్ ప్రభుత్వానికి సమర్పించిన మెమోరాండాన్ని చూశాక అప్పారావు ఇంకా మతి భ్రమించినట్టు చెలరేగిపోతాడు. తప్పనిసరిగా అయినా ప్రభుత్వం ‘డి.జి’ ని నాని విషయంలో పురమాయిస్తుంది. అప్పుడు నానీ దక్కితే అప్పారావుకు అండగా వున్న మీ డిపార్ట్‌మెంట్‌లోని కొందరు వ్యక్తులే నానీ ప్రాణాల్ని....”.

“ ప్లీజ్ మిస్టర్ రామసూరీ” అసహనంగా ప్రొటెస్ట్ చేస్తున్నట్టు వారించాడు యశస్వి “నా డిపార్టుమెంటులోనూ కలుపు మొక్కల్లాంటి కొందరు వ్యక్తులుంటారని నేను అంగీకరిస్తాను కాని... మీరు ఎగ్జాగరేట్ చేసినంత దుర్మార్గులుండరు... ఉండే అవకాశం లేదు. ఆఫ్టరాల్ ఐదేళ్లకోసారి పదవిని చేపట్టే ఈ మంత్రుల కోసం సెంటిమెంట్స్‌ని పూర్తిగా చంపుకోగలిగేంతటి రాక్షసులుంటారంటే హౌ కెన్ ఐ బిలీవ్.... మాలోనూ తండ్రులుంటారు, అన్నలుంటారు. ఒక నేరస్తుడికి కొమ్ము కాస్తారేమో కాని కోరి ఓ పసికందు ప్రాణాలను తీయలేరు మిస్టర్ రామసూరి....!”

“రాఖీ కట్టిన ఆడపిల్ల చేతుల్నందుకుని రేప్ చేసే ఖాకీ మనుషుల గురించి నీకు తెలిసింది చాలా తక్కువని చెప్పటానికి చింతిస్తున్నాను మిస్టర్ యశస్వీ....!”

“నేనూ పోలీసాఫీసర్నే!”

“కాని నీలాంటి వాళ్ల శాతం తక్కువ, ఇట్స్ నెగ్లిజబుల్”

“కాదని నిరూపిస్తాను.”

“ఎలా?”

“నానీని రక్షించి”

“నువ్వొక్కడివీ. అంతేగా?”

“కాదు. నా డిపార్ట్ మెంటులో మెజారిటీ అండతో.”

“ఎలా!”

“అది ఇప్పుడు చెప్పను, కాని ఇప్పటినుంచి అదే ఏర్పాట్లలో వుంటాను. మీ అనుమానం ఆమోదయోగ్యంగానే తీసుకుని మీరన్న నిజాయితీ లేని ఆ ఖాకీ మనుషుల్నే ఓ ట్రాప్‌లో ఇరికించి నానీని బ్రతికించే అవసరం వాళ్లకే ఏర్పడేట్లు
చేస్తాను”.

"నిజంగా!" ఓ నవ్వు వినిపించింది అవతలివేపునించి "అలా అయితే ఇంతకాలం మీ డిపార్ట్‌మెంట్‌పై నాకున్న అపనమ్మకం, అసహ్యం పూర్తిగా చెరిపేసుకుంటానని హామీ ఇస్తున్నాను."

"యస్ ఇట్స్ చాలెంజ్?"

"దెన్ ప్రొసీడ్! మా పోరాటం మా పక్కనుంచి మేం సాగిస్తుంటాం. నీ ప్రయత్నం నువ్వూ చెయ్యి " ఫోన్ క్రెడిల్ చేసిన చప్పుడు వినిపించడంతో తనూ రిసీవర్నుంచి పక్కకు తిరిగాడు.

సరిగ్గా అప్పుడే బాత్‌రూంలో నుంచి బయటికొస్తూ కనిపించింది హరిత.

అంతవరకూ జరిగిన సంభాషణ ఆమె వినలేదు. వింటే జోక్ చేసేది కాదు. అహర్నిశలూ యశస్వి పడుతున్న శ్రమను చూసి సేదతీర్చాలన్నదే ఆమె ప్రయత్నం.

పైకి లేచాడు.

హుందాకన్నా ఆకతాయితనమే ఎక్కువగా వున్న హరిత అతడి మూడ్‌ని అప్పటికీ అర్థం చేసుకోలేకపోయింది.

"పెళ్ళన్నది అప్పులాంటిది. బాధ్యతగా బకాయి తీర్చుకోవాల్సి వస్తుంది. కాబట్టి అంతకన్నా ఆయాచితంగా వచ్చే బహుమతిలాంటి ప్రేమ గొప్పదంటాడు బెర్ట్రండ్ రస్సెల్.... సో.... మనకు మోస్టు అన్‌సక్సెస్‌ఫుల్ పార్టనర్ షిప్‌కి కారణమైన మేరేజ్‌కన్నా ప్రస్తుతానికి ప్రేమ అవసరమనుకుంటా...." బాగా చేరువగా వెళ్ళిన హరిత అప్పుడు చూసింది యశస్వి కళ్ళలో అసహనాన్ని "ఏమిటి... ఎందుకు యశస్వీ- ఎందుకలావున్నావు?" అడిగింది ఆందోళనగా.

"వెళ్లిపో హరితా..... నాతోబాటు నువ్వూ రొంపిలోకి దిగడం నేను ఇష్టపడలేను" తను క్రమంగా ఎలాంటి ప్రమాదభూయిష్టమైన వలయంలోకి అడుగుపెట్టేది చెప్పకుండానే నచ్చచెప్ప బోయాడు....

"యశస్వీ...." ఆమె కళ్లలో గిరుక్కున నీళ్లు తిరిగాయి "నేను వచ్చింది వంటరిగా తిరిగి వెళ్ళడానికి కాదు!"

"బహుశా నేను ఇప్పట్లో తిరిగి రాలేను"

"అప్పటిదాకా నేను నీకు తోడుంటాను."

"అది నీకూ ప్రమాదమే హరితా!" తనను నిభాయించుకొంటూ కిటికీని చేరుకున్నాడు. "నేనొక మామూలు పోలీసాఫీసర్ని హరితా.... అంతకుమించి నిజాయితీ పక్క నిలబడే ప్రయత్నంలో ఓ పసికందుని ఆపదలోకి నెట్టినవాడ్ని. ఓటమిని అంగీకరించనూ... లేక గెలవగలనని చెప్పనూ లేకా-నానీ విషయంలో నా మూలంగా జరిగిన అనర్థాన్నే జీర్ణించుకోలేని నేను ఏ ఆకుమాటునో పసివాడని రెమలా బ్రతికే నిన్ను నాతోబాటు ముళ్ళబాటలో ఎలా నడిపించను. అందుకే నిన్ను అర్థిస్తున్నాను. వెనక్కి వెళ్ళిపో...."

"నువ్వింత నిరాశావాదివా యశస్వీ!"

వెనకి తిరిగాడు. ఆమె కళ్ళలో నుంచి ముత్యాల్లా నీళ్ళు చెంపల పైకి జారుతున్నాయి

"నేను ప్రేమించింది అదిగో నీలో ఆ నిజాయితీనే అయినప్పుడు
వెనక్కి ఎలా వెళ్లగలననుకున్నావు-నాది పసిపిల్ల మనస్తత్వమే అయినా, మొండితనం కూడా ఎక్కువే అని నీకూ తెల్సుగా.... చెప్పు- నీగదిలో నీతో కలిసి వుండటం నీకు అభ్యంతరమైతే మానసికంగా అలసిపోతున్న నీకు కాస్త ఓదార్పునందించే నా ప్రయత్నం పొరపాటైతే మరో గది అద్దెకి తీసుకొంటాను- నీతో కలిసే తిరిగి వెనక్కి వెళతాను...."

"అదికాదు హరితా-"

"నన్నేం ఓదార్చక్కర్లేదు" అలిగినట్టు దూరంగా జరిగిన హరితలో ఇప్పుడు పసితనం కన్నా మొండితనమే కనిపించింది.

పొదివిపట్టుకుని కళ్ళు తుడిచాడు "మా అమ్మంటుండేది-"

"ఏమని-"

"వయసులో వున్న అమ్మాయిల్ని నమ్మకురా అని"

"అదేం?"

" ఒక పసిబిడ్డని మగాడిగా తీర్చిదిద్దటానికి తల్లిగా తనను పాతికేళ్ళు పడితే అమాయకుడ్ని చేసి ఆడించడానికి ఆ అమ్మాయికి అయిదే అయిదు నిముషాలు పడుతుందనీ మరీ మరీ చెప్పేది."

నవ్వకుండా వుండలేక పోయింది.

అప్పుడు వాచీ చూసుకొన్నాడు - హఠాత్తుగా ఏదో గుర్తొచ్చినట్లు.

రాత్రి పదకొండు గంటల పదిహేను నిమిషాలు కావస్తోంది.

"ఓ గంటలో వస్తాను గడియపెట్టుకో"

ఆమెకు వివరాలు చెప్పలేదు. వేగంగా బయటకు నడిచాడు.

*　　　*　　　*　　　*

హోటల్ మనోరమ రూం నెంబరు నూట తొంభై.....

'బ్రా హుక్స్' పెట్టుకుంటూ చంద్రం ఒడిలోనుంచి లేచిన కామేశ్వరి "ఏంటో.... కన్నెగా బ్రతికిన నాకు నిన్ను కలిసిన రోజు నించి ప్రతిరాత్రీ తొలిరాత్రిలాగే వుండేది కాని ఈ రోజు నీ తడబాటు చూస్తూంటే వారం రోజుల్లో ముసలితనం
వచ్చేసినట్టయిపోయావు" అంటూ తన అసంతృప్తిని వ్యక్తం చేసింది ఓరకంట చూస్తూ.

ఆయాసపడిపోతూ ఈసారి బ్రాందీని సోడాతో డైల్యూట్ చేయకుండా సరాసరి బాటిల్ తోనే గడగడా తాగేశాడు.

సాయంకాలమనగా వూరిలో అడుగుపెట్టిన చంద్రం కామేశ్వరి ఎక్కడున్నదీ తెలుసుకోవటానికి గంట పట్టింది. హోం మినిష్టర్‌ని కలసి కష్టం చెప్పుకుని నిన్ను కాపాడతానని వచ్చిన మనిషి ఇక్కడే సెటిలై పోవడంతోనూ, పైగా అక్కడ పోలీసులు ఇంటారాగేషన్‌తో కంగారై పోతుంటేనూ ఉండలేకపోయాడు.

"కా....ము....డూ"

మళ్లీ అమాంతం ఆమెను బెడ్‌పైకి తోశాడు.

కొండ చిలువలా చుట్టుకుపోయాడు.

"ఒణుకుతున్నావేటి చంద్రం-నీకు నేనున్నాను కదా!" చేతితో లుంగీ లాగేసింది "నా ప్రాణాలు అడ్డుపెడతాను."

ఆపసోపాలు పడిపోతున్నాడు చంద్రం.

"బరువెంతో చూపిస్తున్నావు తప్ప నీ కరువు తీర్చుకున్నట్టు లేదు" మరో అస్త్రం సంధించింది.

అసహనంగా లేచిపోయాడు.... ఇక తనకు సాధ్యం కాదన్నట్టు.

"ఏమైంది నీకు?"

"సరళని దాని మొగుడొదిలేస్తానంటున్నాడు" రొప్పుతూ అన్నాడు.

అంటే రాజారావుతో సంబంధమున్నట్లు తెలిసిపోయిందన్నమాట. పాపం" జాలి చూపించింది అతడి మొహాన్ని గుండెలకు హత్తుకుంటూ.

"అమ్మ నెత్తి నోరూ బాదుకుంటోంది ఏమవుద్దో అని."

"ఎంతయినా మావి ఆడపుట్టుకలు కదా.... అలా భయపడుతుంటాం"

"ఏం కాదంటావా కాముడూ?"

వేడెక్కిపోతున్న ఒంటిని చల్లార్చే చేవలేని చంద్రానికి ఓపిగ్గా జవాబులివ్వడం కష్టంగానే ఉంది. అయినా తమాయించుకుంటూ అంది.

"ఏం కాకపోవడమేమిటి..... నీ కొడుకు వాడే ఆ సిసీంద్రిగాడు కానీ కోర్టుకొచ్చి అసలు సంగతి చెప్పాడనుకో నాకేమి కాదుగానీ నిన్ను, మీ అమ్మను, నీ చెల్లిని మాత్రం ఉరేస్తారు. అదిగో.... అలా బెంబేలు పడిపోకు. చెప్పానుగా నా ప్రాణాలు అడ్డం పెడతానని. కాని..." ఓ క్షణం ఆగింది "ఇప్పుడు నానీ నోరు మూయించడమెలాగ.... అసలు ఎక్కడున్నాడో.... పైగా అప్పారావుగారూ మీ వాడిని సఫా చేసేయమని మనుష్యుల్ని పంపారు."

అర్థం కానట్టు చూస్తున్న చంద్రానికి తనే మందు సర్వ్ చేస్తూ తన పాత్రకు బదులు మరో ఆడదాని పేరేదో చెప్పి మొత్తం జరిగిన వ్యవహారమంతా తెలియపరిచింది " ఆ రీలుకోసం అప్పారావు మనుషులు నానీకోసం వెదుకుతుంటే, నీ చెల్లెలు పంపిన రాజారావు మరోపక్క వేట మొదలుపెట్టాడు. ఏదీ దొరికితేనే... హమ్మో.. వాడు పిల్లాడా...! పిడుగు. చెపుతున్నాగా చంద్రం ....వాడు బతికి వుంటే మీరెవ్వరూ బ్రతకరు" అని ఆత్మీయంగా చంద్రం తల నిమిరింది

"ఒక పసిపిల్లాడికి తండ్రిగా ప్రాణాలు తియ్యడమన్నది నీకూ కష్టమయిన విషయమే అనుకో -కాని ఏంచేస్తాం.... ప్రాప్తంలేదని సరిపెట్టుకోవాలి. అయినా నీ పిచ్చిగాని నువ్వు

బ్రతికుంటే-నేను నీకు పెళ్ళాన్నయితే మనకి పిల్లలు పుట్టరా? నానీ లేని లోటు తీర్చరా? అదేం చిత్రమో- నానీ చావాలని ఒక పక్క కోరుకుంటూనే వున్నా మరోపక్క నా తల్లి మనసు తప్పుకాదని నిలదీస్తుంటాది. ఏం చేయను నాకు నీ ప్రాణాలు
ముఖ్యం కదా."

పోస్తున్న మందుకన్నా, మత్తెక్కించే ఆమే చేష్టలకన్న తనకోసం అంగలార్చుకుపోతున్నట్టు చెప్పే ఆ మాటలే క్రమంగా విషంలా ఒంటిలో ప్రాకడంతో కసిగా మరింత తాగేడు "అవును కాముడూ.... వాడ్ని నేను.... నేనంటే నేను షంపేస్తాను. నాకు నువ్వు- నీకు నేను.... ఏమంటావు.... రేపటినుంచి వేట మొదలుపెడతాను. పోలీసుల దగ్గర కెళ్ళి ఏడి నా కొడుకు అంటూ ఏడ్చేస్తాను వెదకమంటాను. అంతా గాలించేస్తాను. దొరికాడే అనుకో.... ఇదిగో ఇలా పీక పిషికి షంపేస్తాను." అంటూ బాటిల్ పట్టుకుని కసిగా ఒత్తాడు.

హమ్మయ్య.... ఇప్పుడు నాకు ధైర్యంగా వుంది" అమాంతం అతన్ని చుట్టుకుపోయింది కామేశ్వరి "అవునూ.... మనకి ముందు అదే నానీ పోయాక ఆడపిల్ల పుడితే బాగుంటుందా? మగపిల్లాడైతే బాగుంటుందా?"

అంటూ చంద్రాన్ని వెల్లకిలా తోసి మీదకు ఎక్కింది.